క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలెక్టర్ విడిది కార్యాలయంలో బుధవారం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డి.నరసింహకిశోర్ మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు. ఈ మేరకు కిశోర్‌ను కలెక్టర్ అభినందించారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై చర్చించారు.

మురుగు నీరు తొలగింపు



వేమగిరితోటలో మురుగు కాలువలో నీటిని తోడుతున్న సిబ్బంది

కడియం: వేమగిరి తోటలోని మురుగు కాలువల్లో నీరు ఎటూ కదలకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై స్థానికుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో కాలువల్లో నీటిని బుధవారం పంచాయతీ సిబ్బంది సెప్టిక్ ట్యాంకర్ సాయంతో బయటకు తోడి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పర్యవేక్షించారు.

వలంటీర్లకు అభినందన

ప్రకాశంనగర్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం స్థానిక దేవీచౌక్ వద్ద ఉన్న జగన్నాథ ఆలయానికి వచ్చే భక్తులకు ఆదిత్య డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన 98 మంది వలంటీర్లు సేవలందించారు. వీరి సేవలను ఆదిత్య సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కేఎన్ రెహమాన్ అభినందించారు.

ఏడీఏ కార్యాలయం మార్పు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ శాఖ రాజమహేంద్రవరం సబ్ డివిజన్ సహాయ సంచాలకుని (ఏడీఏ) కార్యాలయాన్ని బుధవారం హుకుంపేటకు మార్చారు. దీని పరిధిలో రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం మండలాల వ్యవసాయ సిబ్బంది వస్తారు. ఇప్పటి వరకూ దివాన్ చెరువులోని రైతు సేవా కేంద్రంలో ఉన్న ఈ కార్యాలయాన్ని హుకుంపేట పంచాయతీ కార్యాలయం సమీపాన ఉన్న రైతు సేవా కేంద్రంలోకి మార్చామని ఏడీఏ డి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తా..

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకమండలి చైర్మన్‌గా తనను గెలిపిస్తే రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎన్‌డీఏ కూటమి తరఫు చైర్మన్ అభ్యర్థి, బ్యాంక్ మాజీ చైర్మన్ చల్లా శంకర్రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20న జరిగే బ్యాంక్ ఎన్నికల్లో తన ప్యానల్‌ను అత్యధిక మెజార్టీలో గెలిపించాలన్నారు. డైరెక్టర్ అభ్యర్థులు యెనుముల రంగబాబు, పోలాకి పరమేష్, పిల్లి శ్యామ్‌కుమార్, యరమోతు ధర్మరాజు పాల్గొన్నారు.

పూర్వ కలెక్టర్ అవినీతిపై విచారణ జరపాలి

రాజమహేంద్రవరం సిటీ: పూర్వ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా కె.మాధవీలత చేసిన అక్రమాలు, అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, దీనిని దృష్టిలో పెట్టుకుని మాధవీలతపై ఫిర్యాదు చేస్తున్నానని తెలిపారు.



కోటిలింగాల రేవు వద్ద పేరుకుపోయిన చెత్త



పంచిరి మహాదేవుని సత్రం వద్ద గుట్టలా వ్యర్థాలు

వీధుల్లో ముంచెత్తే

- ఎక్కడ చూసినా అధ్వానమే
- పారిశుధ్య లోపంతో ఇక్కట్లు
- వెంటాడుతున్న వ్యాధుల భయం

సీటీఆర్ఐ: ఏ వీధి చూసినా.. ఏముందీ. అంతా చెత్తే. నగరాన్ని ఇది ముంచెత్తుతోంది.. పారిశుధ్య నిర్వహణ నానాటికీ దిగజారుతోంది.. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ పూర్తిగా కరవైంది. అసలే వర్షాకాలం కావడంతో ప్రజలను వ్యాధుల భయం వెంటాడుతోంది. రాజమహేంద్రవరం నగరం వ్యాపారపరంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రత్యేక గుర్తింపు పొందించి. ఇక్కడ మొత్తం 97,840 గృహాలు ఉన్నాయి. లక్షన్నర మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. అర్బన్ పరిధిలో మొత్తం 50 డివిజన్లు ఉండగా, 36 మురికివాడలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య సమస్య వెంటాడుతోంది. ఆయా ప్రాంతాల్లో మురికి కూపాల కారణంగా ప్రజలు దుర్గంధం భరించలేకపోతున్నారు. అయినా నగరపాలక సంస్థ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నారు. నగరంలో సుమారు 630 కిలోమీటర్ల మేర కాలువల వ్యవస్థ ఉంది. ఇందులో పూడికలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. దీనివల్ల వర్షం పడితే పలు వీధుల్లో ముంపునీరు తిష్ట వేస్తోంది. అంతే కాకుండా కాలువల్లో నీరు రోడ్లపైకి చేరడంతో అందులోంచే వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వదిలేసి.. మూలకు చేర్చేసి

నగరంలో రోజుకు 160 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పనం అవుతోంది. ఇందులో పొడి చెత్త 40 మెట్రిక్ టన్నులు ఉంటుంది. తడి- పొడి చెత్తను వేరే చేసే ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను సేకరించాలి. తడి చెత్తతో సేంద్రియ ఎరువు, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయాలి. నగరంలో ఎనిమిది చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి నుంచి తయారయ్యే సేంద్రియ ఎరువు తయారు చేసి సంపద సృష్టించాలనేది ఆశయం. అదెక్కడా అమలు జరగడం లేదు. ఇలా క్రమంగా ఈ కేంద్రాలు మూలకు చేరాయి. చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసేందుకు స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్‌లో రూ.40 లక్షలతో ఏర్పాటైన ప్లాంటునూ పక్కన పెట్టేశారు. ఇక్కడ కూరగాయ వ్యర్థాలు తదితర వాటితో ఒక గంటలోనే సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు ఓ మెషీన్ కూడా ఏర్పాటు చేశారు. ఇదీ అమలు జరగడం లేదు. ఇంటింటా చెత్త సేకరణలోనూ అనేక లోపాలున్నాయి. వాస్తవానికి ఇంటింటా వెళ్లాల్సిన వాహనం కొన్నిచోట్ల వీధుల్లో ఓ చోటుకు పరిమితం అవుతోంది. నివాసితులు అక్కడకు తీసుకెళ్లి చెత్తను వెయాల్సిన పరిస్థితి ఉంటోంది. ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తలో ఎక్కువ భాగం పేపరుమిల్లు వద్ద యార్డులో డంప్ చేస్తున్నారు.

నో ఫాగింగ్..

చెత్త సమస్య ఇలా ఉంటే ఆయా డివిజన్లలో దోమల నివారణ చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. మొత్తం నగరంలో దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలు ఎనిమిది మాత్రమే ఉన్నాయి.

మరికొన్ని అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఈ ప్రక్రియ కొన్ని డివిజన్లకే పరిమితం అవుతోంది. కనీసం ప్రతి డివిజన్‌లో రెండు రోజులకు ఒక్కసారైనా ఫాగింగ్, మురుగు కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయాల్సి ఉన్నా అది జరగడం లేదు. దోమల నివారణ మందు నిమిత్తం ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ప్రయోజనం ఉండడం లేదు.

రేవు.. కష్టాలు తీరవు

గోదావరి తీరం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. పుణ్యస్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులకు రోత పుట్టిస్తోంది. కోటిలింగాల రేవు పూర్తిగా చెత్తతో నిండిపోయింది. ఇక్కడ అత్యధికంగా కర్మకాండలు ఆచరించడానికి దేశం నలు మూలల నుంచి ప్రజలు వస్తుంటారు. అంతే కాకుండా ఇక్కడ వెలిసిన కోటిలింగేశ్వరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. రేవులో పేరుకుపోయిన చెత్తను తొలగించడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. నగరంలో పారిశుధ్య సిబ్బంది సరిపడినంత లేకపోవడమూ చెత్త సమస్యకు ప్రధాన కారణం.

నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

రాజానగరం: మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మరిడి మురళి, నల్లమిల్లి మోహన్ ఎన్నికయ్యారు. బుధవారం స్థానికంగా కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కోశాధికారిగా పలివెల సురేష్, ఉపాధ్యక్షునిగా దారా శివ, సంయుక్త కార్యదర్శిగా కె.సుందర్ విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రమేష్, గౌరవ అధ్యక్షులుగా వి.చిట్టిబాబు, గిరి ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా సాయి, బుజ్జిలతోపాటు కార్యవర్గ సభ్యులుగా అశోక్, రమణ, సత్యరాజ్, రాజేష్, జయకృష్ణ, శివ, రాములను ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు కోనే శ్రీను, గౌరవాధ్యక్షుడు దొండపాటి లాజరు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం

రాజమహేంద్రవరం సిటీ: చిన్న సమస్యనూ పట్టించుకోక కొందరి ప్రాణాల మీదకు వస్తోంది. రాత్రిళ్లు అదే ప్రమాదకరంగా మారింది. రాజమహేంద్రవరంలోని కృష్ణానగర్ జంక్షన్లో ఓ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కృష్ణానగర్ నుంచి రామచంద్రరావు పేట మీదుగా పేపర్‌మిల్ రోడ్డు వైపు వెళ్లే దారి మధ్యలో మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతింది. మరమ్మతులు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో స్థానికులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే మ్యాన్‌హోల్‌పై అడ్డంగా బోర్డును ఏర్పాటు చేసుకున్నారు. మ్యాన్‌హోల్ దెబ్బతినడంతో రోడ్ సగం మాత్రమే తెరిచి ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం నీట మునిగే ఈ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితిపై ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కృష్ణానగర్‌లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్

కారంచేడు మృతవీరులను స్మరించుకుందాం



అంబేడ్కర్ విగ్రహం వద్ద కారంచేడు మృతవీరులకు నివాళులర్పిస్తున్న లాజర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కారంచేడులో 1985 జూలై 17న జరిగిన ఘటనలో ఆరుగురు మాదిగలు బలయ్యారని, ఆ మృతవీరులను స్మరించుకుందామని రిపబ్లికన్ పార్టీ అనుబంధ సంఘ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనాల లాజర్ అన్నారు. బొమ్మూరు సెంటర్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన అధ్యక్షతన కారంచేడు మృతవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లాజర్ మాట్లాడుతూ కారంచేడు దళితులపై పెత్తందారులు దారుణ మారణ హోమాన్ని సృష్టించి 35 ఏళ్లయినా ఆ దళిత మృతవీరులకు న్యాయం జరగలేదన్నారు. ఆ కేసు ఇంకా సుప్రీంకోర్టులోనే ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెచ్చు మీరుతున్నాయన్నారు. వీటిని నిలువరించడానికి ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అంబేడ్కర్ సంఘ నాయకులు కప్పల పోలు, ముప్పిడి రాము, చంద్రరావు, చిన్న, నెల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



స్టార్ గ్రూప్ ఆవిర్భావ సభను బెలూన్లు వదిలి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆల్‌బ్యాంక్ కాలనీలోని శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన స్టార్ గ్రూప్ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో అతిథి నగర కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ర్యాంకులతో పాటు ఇతర రంగాల్లో విద్యార్థులు పాల్గొనేలా శిక్షణ ఇస్తున్న శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థుల పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్లు టి.శ్రీవిద్య, టి.శ్రీలేఖ పాల్గొన్నారు.

పూజ చేయగ.. మది మురవగ

- వాడవాడలా తొలి ఏకాదశి పర్వదినం
- కిటకిటలాడిన ఆలయాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక గోవింద క్షేత్రం, వరాహ నరసింహస్వామి ఆలయం, గోదావరి గట్టున వేణుగోపాలస్వామి క్షేత్రంతో పాటు అనేక వైష్ణవ ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు చేశారు. తెల్లవారు జామున గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాలను దర్శించుకున్నారు. అష్టలక్ష్మి ఆలయంలోని లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కడియం: వేమగిరి గ్రామ దేవత ముత్యాలమ్మకు భక్తులు సారె, చీరలను సమర్పించారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు, గాజులు, స్వీట్లు సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున మహిళలు దాదాపు 200 కిలోల స్వీట్లను అమ్మవారికి సమర్పించారు. తొలుత గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కడియం మేకలదిబ్బపై కొలువుదీరిన రాధాకృష్ణుల విగ్రహాలకు దివంగత సూరపురెడ్డి పెదకాపు కుమారుడు వీర్రాజు (రాజేష్), విజయలక్ష్మి దంపతులు రూ. 60 వేల విలువైన వెండి కిరీటాలను సమర్పించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వీటిని అలంకరించారు.

శాకంబరీ నమోస్తుతే..

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని ఓనుపులమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ఏకాదశి పర్వదినం కావడంతో పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకు కూరలతో అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. బొమ్మూరు దోసాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాటిలైట్‌సిటీలో గురజాల అక్కమ్మతల్లి జాతరను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం ఆరు గంటల నుంచి అక్కమ్మతల్లికి పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం 108 ఘటాలతో రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలో కొండపై నుంచి అక్కమ్మతల్లిని ఊరేగింపుగా ఊళ్లోకి తీసుకువచ్చారు.

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు చితిరాల ముత్యాలరావు, కుటుంబ సభ్యులు సుమారు రూ.లక్ష విలువైన వెండి గదను స్వామివారికి సమర్పించారు. ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, సాయంత్రం హనుమంత వాహనంపై గ్రామోత్సవం జరిగింది. దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ), అర్చకులు పొన్నూరి అనంతసత్య వల్లభాచార్యులు, భరద్వాజ్, మహంకాళి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం గోవింద క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



శాటిలైట్ సిటీలో గురజాల అక్కమ్మతల్లి వద్ద ఉంచిన 108 ఘటాలు



వేమగిరిలో ముత్యాలమ్మకు సారె సమర్పిస్తున్న భక్తులు




ధవళేశ్వరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



శాటిలైట్‌సిటీలో అక్కమ్మతల్లికి 108 ఘటాలతో ఊరేగింపు



బొమ్మూరులో శాకంబరిగా దోసాలమ్మతల్లి



సువర్ణాకాశం

సాయం సంధ్యా సమయాన సూర్యకాంతి స్వర్ణశోభితంగా కనువిందు చేసింది. బుధవారం రాజమహేంద్రవరం నగరంలో సూర్యాస్తమయ సమయాన ఆకాశంలో ఈ అద్భుత దృశ్యం అలరించింది. ఇది ప్రకృతి ప్రేమికుల మది దోచింది. ఈ దృశ్యాన్ని చిట్టి కెమెరాలో బంధించేందుకు పలువురు పోటీపడ్డారు.

– రాజమహేంద్రవరం సిటీ

రేషన్ బియ్యం స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: గొల్లప్రోలు నుంచి కడియం గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాజానగరం డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లయిస్) గొలుగూరి బాపిరాజు, సిబ్బందితో కలసి పట్టుకున్నారు. డీటీ బాపిరాజుకు అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో వీఆర్వోలతో కలసి హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఉన్నారు. సుమారు రెండు గంటల సమయంలో మినీ లారీని ఆపి తనిఖీలు నిర్వహించగా, 176 బస్తాల్లో 7,630 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన మినీ లారీ డ్రైవర్ గట్టెం రవికుమార్, డ్రైవర్‌కు సాయంగా వచ్చిన గొల్లప్రోలుకు చెందిన కొత్త శ్రీనులను విచారించారు. ఈ విచారణలో బియ్యానికి సంబంధించి ఎటువంటి కాగితాలు లేవని, తనకు డ్రైవింగ్ లైసెన్సు లేదని డ్రైవర్ రవికుమార్ తెలిపాడు. రాజానగరం వద్ద లారీని యజమాని అల్లమల్లు రాంబాబు తనకు ఇచ్చి కడియం వెళ్లి అతనికి ఫోన్ చెయ్యామన్నాడని డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజుకు వివరించాడు. లోడుతో ఉన్న లారీని రాజానగరంలోని విష్ణుగురుదత్త రైసుమిల్లుకు తరలించామని, దీని విలువ రూ.3,47,165 ఉంటుందని డీటీ తెలిపారు. రాంబాబు, గట్టెం రవికుమార్, కొత్త శ్రీనులపై బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేశారు.



బియ్యం లోడుతో ఉన్న లారీ వద్ద డిప్యూటీ తహసీల్దార్ బాపిరాజు